# సాక్షి పెద్దపల్లి

మంగళవారం : 24 : జూన్ : 2025






## 'హండ్రెడ్ డేస్ సెల్ఫీ'

కోల్‌సిటీ: రామగుండం బల్దియా ఎదుట 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దాని ఎదుట నిల్చొని బల్దియా అధికారులు, సిబ్బంది 'సెల్ఫీ' దిగారు.



## చట్టాలపై అవగాహన అవసరం

ఫెర్టిలైజర్‌సిటీ : చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా లీగల్ అథారిటీ సెక్రటరీ స్వప్నరాణి అన్నారు. ఎల్కలపల్లిలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సంక్షేమానికి ప్రాధాన్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్దబొంకూర్, ఎలిగేడు మండలంలో సీసీ రోడ్డు నిర్మాణాలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల పనులకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. గత పాలకులు ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, నాయకులు రామ్మూర్తి, మల్లన్న, రాజేందర్, మహేందర్, అర్కుటి సంతోష్, పెగడ రమేశ్, సరోత్తంరెడ్డి, శ్రీకాంత్, కనకయ్య, శ్రీనివాసరెడ్డి, రమేశ్, తిరుపతి, రాజయ్య సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, నరహరి సుధాకర్‌రెడ్డి, బాలుసాని పరుశరాములుగౌడ్, పోల్సాని పుల్లారావు,పూరెల్ల శ్రావణ్, కొండయ్య పాల్గొన్నారు.

### మహిళా కళాశాలలో చేరండి

గోదావరిఖని: సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు చేరాలని అధ్యాపకులు దేవిక, ఆషాజ్యోతి, టి.నాగమ్మ కోరారు. సోమవారం ఆర్జీ–2 ఏరియాలో పర్యటించారు. కొత్తగూడెంలో సింగరేణి కళాశాల విశిష్టతలు, విద్యాబోధన, సౌకర్యాలు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. సుశిక్షితులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ విద్యాబోధన, నాణ్యమైన విద్యాప్రమాణాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని తెలిపారు.కార్మికులు, కార్మికేతరుల పిల్లలు కూడా ఇందులో ప్రవేశాలు పొందాలని వారు కోరారు.

### 'మోడల్' ఇళ్ల పరిశీలన



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): అంతర్గాం, మద్దిర్యాలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌లను బల్దియా అధికారులు సోమవారం పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేశామన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హన్మంతరావు నాయక్, గృహనిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, ఏఈ భువనేశ్వరి పాల్గొన్నారు.

### సమ్మె నోటీసు అందజేత



సమ్మెనోటీసు అందిస్తున్న నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథికి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ జూలై 9వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెను సంఘటిత, అసంఘటిత కార్మికులు విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వి.చందర్, ఉపాధ్యక్షుడు మేకల సతీశ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

### ఎఫ్‌ఎల్‌ఎన్‌ను విజయవంతం చేయాలి



పాఠం చదివిస్తున్న డీఈవో మాధవి

ధర్మారం(ధర్మపురి): ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి మాధవి కోరారు. వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. విద్యా బోధన విధానం, ఎఫ్‌ఎల్‌ఎన్, యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మాధవి మాట్లాడుతూ, విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించాలన్నారు. లైబ్రరీ పీరియడ్స్ అన్ని స్కూళ్లలో నిర్వహించాలని సూచించారు. మంచిగా చదివిన పిల్లలను వెనుకబడి పిల్లలతో గ్రూప్‌లుగా విభజించి చదివించాలని సూచించారు. ఎంఈవో ప్రభాకర్, సీఆర్‌పీలు కవలిత, కుమారస్వామి పాల్గొన్నారు.

# పనిదొంగలపై నిఘా

**మస్టర్ మరింత కఠినం**

- విధులకు ఆలస్యమైనా, మధ్యలో పనివదిలేసి వెళ్లినా చర్యలు
- సింగరేణి యాజమాన్యం ఆదేశాలతో ముందుకు సాగుతున్న ఉన్నతాధికారులు



గోదావరిఖని: పనులు తప్పించుకుని తిరిగే ఉద్యోగులపై సింగరేణి కఠిన చర్యలు చేపడుతోంది. విధులకు హాజరై పనిమధ్యలోనే ఇంటికి వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టి సారించింది. సంస్థ వ్యాప్తంగా గైర్హాజర్ సంఖ్య పెరుగుతుండగా, విధులకు హాజరై మధ్యలోనే వెళ్తున్న వారిపై నిఘా పెట్టింది. యూనియన్లు, రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా చర్యలకు సిద్ధమవుతోంది. భారీ యంత్రాలు పనిచేసే ఓసీపీల్లో పనిగంటలు పెరిగితే ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే ఓసీపీల్లో పనిచేస్తున్న ప్రైవేట్ ఓబీల్లో షిఫ్టులో 8గంటల పాటు పనిచేస్తుండగా, అదేసింగరేణి సంస్థకు చెందిన డిపార్ట్‌మెంట్ పనులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సరాసరి రోజుకు 6గంటలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లుగా అధికారులు చెబున్నారు. అంతే కాకుండా రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలంటోంది. అయితే సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోవడంతో లైట్‌జాబ్‌లు, ఉచిత మస్టర్లు, విధుల మధ్యలో వెళ్లిపోతున్నట్లుగా యాజమాన్యం గుర్తించింది.

**ఓసీపీలపై ప్రత్యేక నిఘా..**

సింగరేణిలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ఓసీపీలపై యాజమాన్యం దృష్టి సారించింది. ఒకకార్మికుడు విధుల మధ్యలో వెళ్లినా ఆ ప్రభావం షిఫ్టుపై ప్రభావం చూపుతోంది. కొన్ని సందర్భాల్లో పెద్దసంఖ్యలో కార్మికులు బయటకు వెళ్తుండటంతో చట్టపరమైన చర్యలకు వెళ్తోంది. ఈక్రమంలో అధికారులకు కూడా తలనొప్పిగా మారుతోంది.

**ఉచిత మస్టర్లు ఇకబంద్..**

ఉద్యోగుల ఉచిత మస్టర్లపై యాజమాన్యం దృష్టి సారించింది. మస్టర్‌పడి ఇంటికి వెళ్లే వారిపై డేగకన్ను వేసింది. సెక్యూరిటీ సిబ్బందితోపాటు సీసీ కెమెరాల నిఘా ఉంచింది. డ్యూటీ మధ్యలో వెళ్తున్న కార్మికుల పేర్లను అవుట్‌పోస్టులో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నమోదు చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. దీంతో చార్జిషీట్, సస్పెండ్, నోటీసు జారీ చేయడంలాంటి పనిష్మెంట్ కొనసాగుతోంది.

**ఉత్పత్తికి సహకరించాలి**



పోటీ యుగంలో ధీటుగా రాణించాలి. పక్కనే ఉన్న ఓబీలో షిఫ్టుకు 8 గంటలు పనిచేస్తుండగా, సింగరేణిలో 6 గంటల వరకు యంత్రాలు వినియోగిస్తున్నారు. దీంతో ఉత్పాదకత ఖర్చు పెరుగుతోంది. ఈవిషయంలో ఉద్యోగులందరూ సహకరించాలి. మస్టర్ పడి ఇంటికి వెళ్లినా, డ్యూటీ మధ్యలో వెళ్లినా చర్యలు తప్పవు.

– లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం

# అన్నదాతా.. రైతు వేదికకు రావా?

- కర్షకులను బతిమాలుకుంటున్న ఏఈవోలు
- సీఎం కార్యక్రమం కోసం ఏఈవోలకు టార్గెట్లు
- ప్రతీ ఆర్వీకి 200 మంది రైతులను తరలించాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 50 వేలకుపైగా రైతుల తరలింపు
- టీ, స్నాక్స్ డబ్బులు మాత్రం ఇవ్వరట
- మొన్నటి కార్యక్రమానికి పెట్టిన డబ్బులే రాలేదు




సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతు వేదికల్లో ముఖ్యమంత్రితో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంతో ఏఈవో (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కార్యక్రమానికి రైతు వేదిక(ఆర్వీ)ల వద్దకు రైతులను తరలించాలని జిల్లా వ్యవసాయాధికారులు టార్గెట్లు విధించడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రతీ ఆర్వీలో కనీసం 200 మందికి తగ్గకుండా రైతులను తరలించాలని ఆదేశాల్లో స్పష్టం చేయడంతో ఏఈవోలు అదేపనిలో తలమునకలయ్యారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి వచ్చేందుకు మెజారిటీ రైతులు సుముఖంగా లేరు. ప్రస్తుతం చాలాచోట్ల వ్యవసాయ పనులు మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీఎంతో జరిగే ముఖాముఖిలో తప్పకుండా రైతుభరోసా లబ్ధిదారులతో సీఎం మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేలమంది రైతులకు ఏఈ వోలు ఫోన్లు చేసి కార్యక్రమానికి రావాల్సిందిగా బతిమాలుతున్నారు. మొన్నామధ్య రైతుభరోసా ప్రారంభం సందర్భంగా కూడా రైతులతో ముఖ్యమంత్రితో ఇలాంటి కార్యక్రమాన్నే నిర్వహించారు. అప్పుడు ప్రతీ ఏఈవోకు నిర్వహణ ఖర్చుల కింద రూ.5 వేలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆ కార్యక్రమంలో హాజరైన ప్రతీ రైతుకు టీ, స్నాక్స్‌ను ఏఈవోలే అందించారు. ఇందుకోసం వారే చేతి నుంచి డబ్బులు పెట్టుకున్నారు. ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా? అని ఎదురుచూస్తుంటే.. తీరా మరోసారి అలాంటి కార్యక్రమమే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చేసేది లేక మళ్లీ రైతులకు ఫోన్లు చేస్తూ.. చేతి చమురు వదిలించేందుకు సిద్ధమవుతున్నారు.

**రైతు వేదికల్లో ఇబ్బందులివీ!**

- చాలాచోట్ల తాగునీరు సదుపాయం లేదు
- కుర్చీలు వేసే సిబ్బంది లేరు
- టీ, స్నాక్స్ ఇచ్చే దిక్కు లేదు
- మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు లేరు
- రైతు వేదికకు కనీసం ఊడ్చే సిబ్బంది లేరు
- టెక్నికల్ ఎక్విప్‌మెంట్‌కు డబ్బులు రావు,
- నిర్వహణకు సిబ్బంది లేరు..

| జిల్లా | రైతు వేదికలు | ఏఈవోలు |
| --- | --- | --- |
| కరీంనగర్ | 75 | 71 |
| జగిత్యాల | 52 | 71 |
| పెద్దపల్లి | 54 | 52 |
| సిరిసిల్ల | 57 | 53 |

**ఏఈవోలపై పనిభారం..**

వాస్తవానికి ప్రతీ రైతు వేదికలో ఒకే ఒక ఏఈవో ఉంటారు. రైతులకు సంబంధించిన ప్రతీ విషయం వీరే చేసుకోవాలి. పంటలకు సంబంధించి ఎప్పటికపుడు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం. సాగులో సమస్యలు తలెత్తితే పరిష్కరించడం. పీఎం కిసాన్ యోజనకు సంబంధించి కేవైసీ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయడం, పంటల నమోదు చేయడం, రైతుబంధు, రైతు బీమా నమోదు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి మట్టి నమూనాల సేకరణ తదితర పనులు ఉంటాయి. ఇవి కాకుండా రైతు వేదిక నిర్వహణ బాధ్యతలు కూడా చూసుకుంటారు. వీరు తప్ప మరే ఇతర సిబ్బంది లేకపోవడంతో వీరే ఉదయం వచ్చి రైతు వేదికను ఊడ్చుకోవాలి, కార్యక్రమాలు జరిగినపుడు కుర్చీలు వేయడం, వారికి టీ స్నాక్స్.. కూడా వీరే అందించాల్సి వస్తోంది. అధికారిక కార్యక్రమాలు జరిగినపుడు వచ్చిన వారంతా మరుగుదొడ్లను వినియోగిస్తున్నారు. తరువాత డబ్బులు ఇచ్చి వాటిని శుభ్రం చేయించుకోవాల్సి వస్తోంది. మొత్తానికి ఏఈవోలు నిర్వహించే ప్రతీ అధికారిక కార్యక్రమం ఇంట్లో చేసే శుభకార్యంలా ప్రతీది దగ్గరుండి చూసుకోవాల్సిన స్థితి. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డిని వివరణ కోరగా.. ఏఈవోలకు రైతుల తరలింపు విషయంలో ఎలాంటి టార్గెట్ విధించలేదని, వారే స్వచ్ఛందంగా వస్తున్నారని సమర్థించుకున్నారు.

# 'నీట్'గా క్లాసులు

- ఎప్‌సెట్‌లోనూ ప్రత్యేక తర్ఫీదు
- ఈ ఏడాది నుంచే అందుబాటులోకి
- గుండారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రత్యేకత
- నిర్దేశిత 30శాతం ప్రవేశాలు అధిగమించిన వైనం



కమాన్‌పూర్(మంథని): జిల్లాలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఈ ఏడాది నుంచి ఎప్‌సెట్, నీట్‌లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. ఇదే విషయంపై ఇటీవల విస్తృత ప్రచారం చేయడంతో ప్రవేశాల సంఖ్య భారీగా పెరిగింది. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల భారం మోయలేని తల్లిదండ్రులు.. ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక బోధన పద్ధతులుపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాదు.. తమ పిల్లలను అందులో చేర్పిస్తూ ఉచిత విద్య పొందుతున్నారు. జిల్లావాసులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


**పెరిగిన అడ్మిషన్లు..**

ఈ విద్యాసంవత్సరంలో ప్రతీ ప్రభుత్వ కళాశాలలో 30 శాతం ప్రవేశాలు పెంచాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అడ్మిషన్లు పెంచాలనే లక్ష్యంతో గుండారం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సమీప గ్రామాల్లోకి వెళ్లారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. వారిపిల్లలు ప్రభుత్వ కళాశాలలో చేరేలా ప్రోత్సహించారు. కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, అందుబాటులోకి వస్తున్న బోధన తీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో 110 మంది విద్యార్థులు గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందారని ప్రిన్సిపాల్ తెలిపారు. వారంతా రోజూ క్లాసులకు హాజరవుతున్నారు. అత్యధికంగా డిమాండ్ ఉన్న ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో విద్యార్థులు చేరారు.

**ఈ ఏడాది నుంచి ఎప్‌సెట్, నీట్ క్లాస్‌లు**

ఈ ఏడాది నుంచి కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఎప్‌సెట్, నీట్ క్లాసులను ప్రారంభించారు. ఈ తరగతులు భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపయోగపడతాయని అధ్యాపకులు తెలిపారు. ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ, వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఇది పునాది లాంటిదని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.


### బోధన బాగుంది



గుండారం ప్రభుత్వ కళాశాలలో విద్యా బోధన బాగుందని తెలిసింది. ప్రతీ ఏడాది ఈ కళాశాలలో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకొని ఎంపీసీలో అడ్మిషన్ తీసుకున్న.

– సుంచు అశ్విత, సబ్బితం

### సౌకర్యాలున్నాయి



ప్రభుత్వ కళాశాలలో ఈ ఏడాది నుంచి నీట్, ఎప్‌సెట్ క్లాస్ ప్రారంభిస్తున్నామని లెక్చరర్లు మా ఇంటికి వచ్చి చెప్పారు. దీంతో నేను బైపీసీలో అడ్మిషన్ తీసుకున్నా. విద్యా బోధన, సౌకర్యాలు బాగున్నాయి.

– జి.వెన్నల, పేంచికల్‌పేట

### తరగతులు ప్రారంభించాం



ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎప్‌సెట్, నీట్ క్లాసులు ప్రారంభించాం. 30 శాతం అడ్మిషన్లు పెంచాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను అధిగమించాం.

– సుధాకర్, ప్రిన్సిపాల్, గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల

# సమస్యలు.. విన్నపాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

- సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి ప్రజావాణిలో సమస్యలపై అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వేణుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### పట్టా ఇప్పించండి



పెద్దపల్లి శివారు చందపల్లిలోని ప్రభుత్వ భూమిని గీత పారిశ్రామిక సంఘానికి కేటాయించారు. ఆ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టా పాసుపుస్తకం ఇప్పించండి.

– పెద్దపల్లి గీత పారిశ్రామిక సంఘం నాయకులు

### కూలీలకు వర్తింపజేయండి



ఉపాధిహామీ కూలీలకు కార్మిక సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి. భవన నిర్మాణ రంగ కార్మికులకు వర్తింపజేస్తున్న సంక్షేమ పథకాలను ఉపాధి కూలీలకు కూడా వర్తింపజేసి ఆదుకోవాలి.

– ఆవుల ముత్తయ్య, మడక, ఓదెల

### సాగు చేసుకుంటున్నాం



మా ఊరులోని ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నం. మోకాపై సర్వే చేయించి సాగులో ఉన్న అర్హులైన పేదరైతులకు పట్టాలు ఇప్పించి ఆదుకోవాలి.

– బిట్టుపల్లి రైతులు, మంథని

### ఇల్లు ఇప్పించండి



నిరుపేదరాలినైన నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి. ఏ ఆధారం లేని స్థితిలో ఉన్నా. ఇండ్లలో పాచీపని చేస్తూ బతుకుతున్న. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అన్ని అర్హతలు ఉన్నయి. దయచేసి ఆదుకోండి.

– రాజేశ్వరి, పెద్దపల్లి

### పింఛన్ ఇప్పించండి



మా ఆయన చనిపోయాడు. కుటుంబ పోషణ భారంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న. వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి. నా కుటుంబాన్ని ఆదుకోండి.

– రేచర్ల లత, పెద్దపల్లి

### ఉపాధి కల్పించండి



ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) చదివా. కుటుంబ పెద్ద (మా మయ్య) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. వైద్యం కోసం చేసిన ఖర్చుతో అప్పుల పాలయ్యాం. నాకు ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఉపాధి అవకాశం కల్పించి ఆదుకోండి.

– రజిత, గోదావరిఖని

# 30 లక్షల మొక్కలు లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, హాజరైన వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టే వనమహోత్సవంలో 30 లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమీక్షించారు. 2 మీటర్లకన్నా ఎక్కువ ఎత్తు ఉన్న మొక్కలనే నాటేలా స్థలాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో ఇప్పటివరకు 880 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ముందుకొచ్చారని అన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంట దిగుబడిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతువేదికల వద్ద మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీరైతువేదికలో కనీసం 300 మంది రైతులు హాజరయ్యేలా చూడాలన్నారు. డీఏవో ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇంకుడుగుంతల శుభ్రం



ఇంకుడుగుంతను శుభ్రం చేయిస్తున్న డిప్యూటీ కమిషనర్, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**కోల్‌సిటీ(రామగుండం):** ఎట్టకేలకు బల్దియా అధికారులు ఇంకుడుగుంతలపై దృష్టి పెట్టారు. 'ఇంకని నీరు.. ఆనవాళ్లు కోల్పోతున్న ఇంకుడుగుంతలు' శీర్షికన గతనెల 19న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన రామగుండం బల్దియా అధికారులు, వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆనవాళ్లు కోల్పోయిన ఇంకుడుగుంతలను వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి సారించారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలోని రెండు ఇంకుడుగుంతలతోపాటు నగరపాలక సంస్థ కార్యాలయం వెనకాల మరో రెండింటిని శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీవో శ్వేత, ఊర్మిళ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

### సింగరేణి పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** మంచిర్యాల జిల్లా సీసీసీ- నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కళాశాలలో మొత్తం 300 సీట్లు భర్తీచేస్తామన్నారు. సివిల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైని ంగ్ కోర్సుల్లో 60 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని, పాలిసెట్-2025లో ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఇందులో 150 సీట్లు సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించామన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 28 నుంచి జూలై 3వ తేదీ వరకు సింగరేణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగిలిన సీట్లను కన్వీనర్ కోటా కింద ఇతరులకు కేటాయిస్తామని, వీరు తెలంగాణ ప్రభుత్వ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఇతర వివరాల కోసం 90102 22161, 87901 12515, 94911 44168 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**కరీంనగర్‌రూరల్:** చొప్పదండి మండలం వెదురుగట్టకు చెందిన విష్ణువర్ధన్(29) బహుదూర్‌ఖాన్‌పేట శివారులో ద్విచక్ర అదుపు తప్పి కింద పడడంతో మృతి చెందాడు. కరీంనగర్‌రూరల్ సీఐ ఎ.నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగునూర్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న విష్ణువర్ధన్ సోమవారం వెదురుగట్టు నుంచి ప్రతిమ ఆసుపత్రికి వస్తుండగా మార్గ మధ్యలోని బహుదూర్‌ఖాన్‌పేట వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి సమీపంలోని చెట్టుకు ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి పర్శ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### హుజూరాబాద్‌లో..



నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

**హుజూరాబాద్:** పట్టణానికి చెందిన ఓ న్యూస్ పేపర్ రిపోర్టర్ చిర్ర సుదర్శన్‌గౌడ్ (55) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. హుస్నాబాద్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో కందకంలో పడి మృతి చెందాడని. మృతుడి కుటుంబానికి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.పదివేలు అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్, హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, పలువురు జర్నలిస్టులు పరామర్శించారు.

### 27న పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు


**విద్యానగర్(కరీంనగర్):** ఆర్టీసీ కరీంనగర్ 1డిపో నుంచి ఈనెల 27న వన్ డే టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ విజయమాధురి తెలిపారు. టూర్ ప్యాకేజీలో చిలుకూరు బాలాజీ, అనంత పద్మనాభ స్వామి, ఏడుపాయల దేవాలయం, అనంతగిరి హిల్స్‌ను సందర్శించేందుకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని అన్నారు. 27న ఉదయం 4గంటలకు కరీంనగర్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 9గంటలకు తిరిగి కరీంనగర్‌కు చేరుకుంటుందని, పెద్దలకు రూ.1.430. పిల్లలకు రూ.900 టికెట్ ఉంటుందని డిపో మేనేజర్ తెలిపారు.

# ఆహ్లాదం.. ఆరోగ్యం

- కనువిందు చేస్తున్న అటవీ ప్రాంతం
- అడవుల రక్షణకు అధికారుల చర్యలు
- సేదతీరుతున్న పర్యావరణ ప్రియులు



గుట్టపై పచ్చని చెట్లు



గుట్టల మధ్య పచ్చదనం

**మంథని:** వేసవి ముగిసింది. తొలకరి పలకరించింది. అడవులు ఆకుపచ్చదనం సంతరించుకున్నాయి. నిన్నామొన్నటి వరకు మోడువారిన చెట్లు చిగురిస్తున్నాయి. చిగురించిన ఆకులతో పచ్చదనం కనువిందు చేస్తోంది. తూర్పు అటవీ ప్రాంతమైన మంథని అడవులు ఆహ్లాదం పంచుతున్నాయి. పర్యావరణ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మంథని నుంచి మహదేవపూర్ వరకు..**

మంథని మండలం ఎక్లాస్‌పూర్ శివారు మొదలు అటవీ ప్రాంతంలో మహదేవ్‌పూర్ మండలం బూర్గుగూడెం వరకు సుమారు 120 కి.మీ. మేర అడవి విస్తరించి ఉంది. రామగిరి, కమాన్‌పూర్ మండలాలు మినహా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, పెద్దపల్లి, రామగిరి మండలాల్లో సైతం అడవులు విస్తరించి ఉన్నాయి. ఒకప్పుడు అంతరించిపోయిన అడవులకు హరితహారం పేరిట ప్రభుత్వాలు మొక్కలు నాటుతూ జీవం పోశాయి. ప్రస్తుతం పచ్చదనం ఉట్టిపడుతుండగా అటువైపు వెళ్లే వాహనదారులు పచ్చని చెట్లబడిలో సేద తీరుతున్నారు.

**స్మగ్లర్ల గొడ్డలి వేటుకు దూరంగా..**

ఒకప్పుడు దట్టమైన అడవులపై స్మగ్లర్ల గొడ్డలి వేటు పడటంతో పెద్దచెట్లు అంతరించిపోయాయి. కలప అక్రమ రవాణా చేస్తూ అడవులను నాశనం చేశారు. దీంతో ఎటుచూసినా పచ్చదనం ఉట్టిపడే అడవులు కానరాకుండా పోయాయి. కానీ ప్రస్తుతం అడవులు మళ్లీ పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి.

**అడవుల రక్షణకు పటిష్ట చర్యలు..**

గత ప్రభుత్వాలు అడవుల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాయి. ఇటు ఫారెస్ట్, అటు పోలీసులు సంయుక్తంగా అడవుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. కలప స్మగ్లర్ల అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు వంటచెరుకును కూడా తీసుకుపోకుండా కందకాలు తవ్వారు. అడవిలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో అడవులు మళ్లీ చిగురించాయి. హరితహారం పేరుతో అడవుల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో అడవులకు పూర్వవైభవం వచ్చినట్లయ్యింది.

**కనువిందు చేస్తున్న పచ్చదనం..**

తూర్పు అడవుల్లో చిగురించిన పచ్చని ఆకులు, చెట్లు కనువిందు చేస్తున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు కాళేశ్వరం, మేడారం, నాగులమ్మ లాంటి ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్తూ అటవీ ప్రాంతాల్లోని పచ్చని చెట్లకింద సేద తీరుతున్నారు. కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణ అనుభూతిని పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంతో కలిసి ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. చెట్ల నీడన సేదదీరుతూ ఆటాపాటలతో ఎంజాయ్ చేస్తున్నారు.



రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు

# ఫలించిన ఓపెన్ చాలెంజ్

- నెరవేరిన ప్రధానోపాధ్యాయుడి లక్ష్యం
- రచ్చపల్లి సర్కార్ స్కూల్‌లో వందశాతం ప్రవేశాలు




పోస్టర్‌తో విద్యార్థులు

**ధర్మారం(ధర్మపురి):** 'ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మా పిల్లలకన్నా బాగా చదవగలరా? అలా ఒక్కరు చదివినా రూ.500 నజరానా ఇస్తాం' అని రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంశీ మోహనాచార్యులు చేసిన ఓపెన్ చాలెంజ్ సత్ఫలితాలిచ్చింది. ఐడీడు విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలోనే కనిపిస్తున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చాలెంజ్‌తోపాటు తల్లిదండ్రులకు నమ్మకం కలిగించారు. గతేడాది 36 మంది విద్యార్థులు ఉంటే అందులో నుంచి ఆరుగురు బయటకు వెళ్లారు. తద్వారా 30 మంది మాత్రమే మిగిలారు. దీనిని సవాల్‌గా తీసుకున్న హెచ్‌ఎం గత ఫిబ్రవరి 21న బడిబాట ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సవాల్ చేస్తూ పోస్టర్‌లు ముద్రించి ఇంటింటా పంచారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఇంటికి వెళ్లి సర్కారు బడి విద్యార్థులతో పోటీపెట్టించి భేష్ అనిపించుకున్నారు. దీంతో ఆ గ్రామ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులపై నమ్మకం ఏర్పడింది. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలలకు ఒక్కవిద్యార్థి కూడా వెళ్లకుండా తీర్మానించారు. వందశాతం మంది విద్యార్థులకు ప్రభుత్వ బడిలోనే ప్రవేశం కల్పించారు. 30 మందికి మరో 20 మంది కొత్తగా అడ్మిషన్ పొందడంతో ఇప్పుడా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 50కి చేరింది. వారిరాకతో కళకళలాడుతోంది.

# బల్దియాలో అక్రమ కట్టడాల కూల్చివేత



కట్టడాలు కూల్చివేస్తున్న జేసీబీ వాహనం

**కోల్‌సిటీ(రామగుండం):** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో సోమవారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పలు అక్రమ కట్టడాలను జేసీబీ వాహనంతో కూల్చివేశారు. గాంధీచౌక్ చౌరస్తాలో ఇటీవల అనుమతి లేకుండా సుమారు 10 దుకాణాలను నిర్మించారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని కూల్చివేశామని టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ నవీన్ తెలిపారు. ఇటీవల శివాజీనగర్ రోడ్డు పక్కనున్న సింగరేణి క్వార్టర్లను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న నేపథ్యంలో, రోడ్డుకు అడ్డుగా ఉన్న దుకాణాలనూ తొలగించారు. ఈ దుకాణాల నిర్వాహకులే ఉపాధి కోసం చౌరస్తాలో తాత్కాలికంగా దుకాణాలు నిర్మించుకున్నట్లు వ్యాపారస్తులు వెల్లడిస్తుండగా, వీటికి ఎలాంటి అనుమతుల్లేవని బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలాఉంటే, స్థానిక కల్యాణ్‌నగర్ చౌరస్తాలోని బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుని ఇంటిని ఇటీవల రోడ్డు విస్తరణ కోసం కూల్చివేత చేపట్టగా, భవన యజమాని విజ్ఞప్తి మేరకు కూల్చివేతను నిలిపివేశారు. సోమవారం మరోసారి మిగిలిన భాగాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు.

# ఖైదీల యోగక్షేమాలు తెలుసుకున్న జడ్జి




జైలు ఎదుట జిల్లా జడ్జి శివకుమార్

**కరీంనగర్‌క్రైం:** కరీంనగర్ జిల్లా జైలును సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్‌తో కలిసి సందర్శించారు. ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. క్యాంటీన్, ఆసుపత్రి, ములాఖత్, ఫోన్, లైబ్రరీ, వంటశాల, ఇండస్ట్రీలలో పనితీరు పరిశీలించారు. కొత్త చట్టాలు వివరించారు. మహిళా జైలును కూడా సందర్శించి కేసుల వివరాలు, బాగోగులు, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. లాయర్లను పెట్టుకునే స్తోమత లేనివారికి ప్రభుత్వం తరపున లాయర్లను నియమిస్తామని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ విజయడేని, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేశ్ ఉన్నారు.

# ఆన్‌లైన్ పెట్టుబడులకు బినామీ కంపెనీలు

- జగిత్యాల జిల్లాలో మూతపడిన 8 కంపెనీలు
- రోడ్డున పడిన పెట్టుబడిదారులు
- వివాదాస్పద భూములు అంటగడుతూ ఆకర్షణ

**జగిత్యాలక్రైం:** ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీలు ఇస్తామని నమ్మించి జిల్లాలో పలువురి నుంచి రూ.కోట్లు వసూలు చేయడంతో చాలామంది రోడ్డునపడ్డారు. పెట్టుబడి పెట్టిన కొద్దిరోజుల పాటు డాలర్ల రూపంలో వ్యాపారుల ఖాతాల్లో జమ చేసిన కంపెనీలు.. భారీ పెట్టుబడులు వచ్చిన తర్వాత మూసివేయడంతో చాలామంది పెట్టుబడిదారులు అయోమయంలో పడిపోయారు. కొన్ని కంపెనీలపై పెట్టుబడిదారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కొంతమందిని అరెస్ట్ చేశారు. అలాంటి ఆన్‌లైన్ దందా రెండు నెలలుగా మళ్లీ జోరందుకుంది. ఆన్‌లైన్‌లో రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.18 వేల వడ్డీ ఇస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.లక్షకు తగ్గకుండా పెట్టుబడి పెట్టిస్తున్నారు.

**రూ.10 లక్షలు పెట్టుబడితే 8 గుంటల భూమి**

ఆన్‌లైన్ కంపెనీలు పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టిన వ్యక్తికి మల్యాల మండలం రాజారం, పోతారం శివారులో ఉన్న 8 గుంటల వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొంత మంది ఆ భూమిపై నమ్మకం పెట్టుకుని పెట్టుబడి పెడుతున్నారు. మరికొందరిని కంపెనీ బ్యాంకాక్ వంటి దేశాలకు తీసుకెళ్తున్నాయి.

**బాండ్ పేపర్ల బాధితుల కథ కంచికే..**

గతంలో జిల్లాలో ఆన్‌లైన్‌లో పలు కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన వారికి కంపెనీలు మూతపడటంతో మధ్యవర్తిగా ఉన్న పలువురు సుమారు రూ.10 నుంచి రూ.15 కోట్లకు బాండ్ పేపర్లు రాసిచ్చారు. మూడు నెలల్లో డబ్బులు చెల్లిస్తామంటూ హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు వారికి నయా పైసా కూడా చెల్లించలేదు. వారే మళ్లీ బినామీ కంపెనీలు పెట్టి మళ్లీ పెట్టుబడిదారులను మోసం చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.



## హరహర మహాదేవ

**వేములవాడ:** 'హరహర మహాదేవ..శంభోశంకర' నామస్మరణతో వేములవాడ మారుమోగింది. వేములవాడ రాజన్నను సోమవారం 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.30లక్షల ఆదాయం సమకూరింది. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ, దీపాల వెలిగింత, కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



# డీపీఆర్ తయారీలో అగ్రగామి

- దేశ, విదేశాల్లోనూ ప్రత్యేక గుర్తింపు
- మినీరత్న హోదా సాధించిన 'వ్యాప్కోస్'



వ్యాప్కోస్ డిజైన్ చేసిన మిషన్ భగీరథ ప్రాజెక్టు

వ్యాప్కోస్ లోగో

**రామగుండం:** వ్యాప్కోస్ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మరోసారి చర్చకు వచ్చిన పేరు. జీవితకాలం ముగిసిన మేడిపల్లి ఓపెన్‌కాస్టు గనిలో సింగరేణి 500 మెగావాట్ల సామర్థ్యం గల పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అంతేకాదు.. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తయారీ బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించడం చర్చనీయాంశం కావడానికి కారణమైంది. ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డీపీఆర్)తయారీలోనూ నిర్దేశిత గడువులోగా అత్యధిక కచ్చితత్వంతో ఈ సంస్థ ప్రత్యేకత చాటుకుంది. డ్యాంలు, పంపుహౌస్‌లు డిజైన్ చేసి అప్పగించడంలోనూ సత్తా నిరూపించుకుంది. మేడిపల్లి ఓసీపీలో చేపట్టిన పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి జియాలాజికల్, జియో టెక్నికల్, హైడ్రాలజీ, సివిల్, ఉత్పత్తి సామర్థ్యం, మెకానికల్, ఎలక్ట్రికల్, పర్యావరణ, పవర్ డిస్ట్రిబ్యూషన్, రక్షణ తదితర అంశాలపై డీపీఆర్ ఇవ్వాలని సింగరేణి వ్యాప్కోస్‌ను కోరింది.

**వ్యాప్కోస్ అంటే..**

వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్‌ను చిన్నగా వ్యాప్కోస్‌గా పిలుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నీటి వనరులు, విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ అధ్యయన రంగాల్లో సేవలు అందించే ఒక ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ ఇది. దీనిని 1969లో స్థాపించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. వ్యాప్కోస్‌కు మినీరత్న సంస్థగా గుర్తింపు వచ్చింది. దేశ, విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టులకు సాంకేతిక సలహాలు, ఇంజనీరింగ్ సేవలు అందిచడంలో దిట్ట. ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికేషన్ కలిగిన సంస్థగా, గుణాత్మక సేవలకు నిదర్శనంగా పేరుంది.

### దేశ, విదేశాల్లో కీలకపాత్ర..

- అఫ్గనిస్తాన్ హెరాత్ ప్రావిన్స్‌లోని సల్మాడ్యామ్ జలవిద్యుత్ ఆనకట్టను వ్యాప్కోస్ డిజైన్ చేసింది.
- భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సరఫరాకు జలజీవన్ మిషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టులూ డిజైన్ చేసింది.
- ఉత్తరప్రదేశ్‌లోని నమామి గంగానది సంరక్షణ, కాలుష్య నియంత్రణ, ల్యాండ్ స్కేపింగ్ డిజైన్ చేసింది.

### విద్యుత్ రంగంలోనూ..

- రువాండాలోని ఎగ్రెజన్ జలవిద్యుత్ పవర్ ప్రాజెక్టు (బురుండి) డిజైన్
- రామగుండం మేడిపల్లి ఓపెన్‌కాస్టు తరహాలో నిర్మించే పంపుడ్ స్టోరేజీ విధానానికి గతంలోనే 600 మెగావాట్ల సామర్థ్యం గల అప్పర్ ఇంద్రావతి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా సేవలు అందిస్తోంది.
- భూటాన్‌లోని మంగ్డేచు జలవిద్యుత్ ప్రాజెక్టుకు డిజైన్ సాంకేతిక సలహాదారుగా వ్యవహరించింది.
- స్వచ్ఛభారత్ మిషన్, రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద గ్రామీణ విద్యుదీకరణ ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది.

### మౌలిక సదుపాయాల రంగం..

- ఫిజీదేశంలో రెండు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సాంకేతిక సలహా సేవలు అందిస్తోంది.
- అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్), స్మార్ట్ సిటీ మిషన్ పథకంలో భాగంగా నీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్ల రూపకల్పన డిజైన్ చేసింది.
- మనదేశంలోని ఓడరేవులు, హార్బర్లు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అభివృద్ధికి డిజైన్, కన్సల్టెన్సీ సేవలు అందించింది.
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద గ్రామీణ రోడ్ల నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తోంది.

**ప్రాజెక్టు రూపకల్పనలో అనుసరించే విధానం..**

- ప్రాజెక్టు ఆర్థిక, సాంకేతిక సాధ్యాసాధ్యాలను అంచనా వేయడం, హైడ్రాలిక్ డిజైన్, వ్యయ అంచనా, డ్రాయింగ్ తయారీ, భౌగోళిక, హైడ్రాలజీ అధ్యయనాలతో క్షేత్ర సర్వేలు, ప్రాజెక్టు రూపకల్పన నుంచి అమలు, నిర్వహణ వరకు సమగ్ర సేవలు అందించడం దీని ప్రధాన లక్ష్యం.

**అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..**

వ్యాప్కోస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సేవలను అందిస్తోంది. ముఖ్యంగా అంగోలా, బంగ్లాదేశ్, భూటాన్, కంబోడియా, ఇథియోపియా, ఫిజీ, మంగోలియా, నేపాల్, రువాండా, శ్రీలంక, ఉగాండా, జింబాబ్వే తదితర 30 దేశాల్లో వ్యాప్కోస్ సేవలు అందించడం మనదేశానికి గర్వకారణమని అంటున్నారు.

# ఎడ్ల నాగలికి భలే గిరాకీ

- పసుపు విత్తనానికి రోజుకు రూ.3500కిరాయి
- ప్రతి గ్రామంలో ఐదారు జతల కాడెద్దులే దిక్కు



ఎడ్ల నాగలితో పసుపు విత్తనం వేస్తున్న రైతులు

**జగిత్యాలఅగ్రికల్చర్:** వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు రావడంతో కాడెద్దులు కనుమరుగయ్యాయి. గ్రామానికి కేవలం ఐదారు జతల కాడెద్లు మాత్రమే ఉన్నాయి. విత్తనాలు వేసే సమయంలో వాటికి భలే డిమాండ్ పెరిగింది. పసుపు వంటి విత్తనం వేసేందుకు కాడెద్లతో వచ్చే రైతుకు రూ.3,500 నుంచి రూ.4వేల వరకు చెల్లించాల్సి వస్తోందంటే గ్రామాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**పోషణ భారమై..**

ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి రైతుకు కనీసం నాలుగైదు కాడెద్లు ఉండేవి. జత కాడెద్లు లేని రైతులు ఉండేవారు కాదంటే అతిశయోక్తికాదు. సాగులో ట్రాక్టర్ల రాకతో ప్రతి పనికీ యంత్రాలనే వినియోగిస్తున్నారు. చిన్న గ్రామంలోనూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో కాడెద్లను పోషించే స్తోమత రైతులకున్నా.. వాటికి నీరు పెట్టడం, మేత వేయడం వంటి పనులు చేయలేక అమ్ముకుంటున్నారు. నాలుగైదు ఎకరాలు ఉన్న రైతు కూడా ట్రాక్టర్ కొంటున్నాడు.

**కాడెద్లకు గిరాకీ**

వాస్తవానికి విత్తనం వేసేందుకు కాడెద్లు తప్పనిసరి. గతంలో ఇరుగుపొరుగు రైతులు అదలుబదలు రూపంలో విత్తనాలు వేసుకునేవారు. ప్రస్తుతం ఆ విధానం మారింది. కాడెద్ల నాగలితో విత్తనం వేస్తే బాగా మొలకెత్తే అవకాశం ఉంటుంది. దీంతో పసుపు విత్తనం వేసేందుకు రైతులు కాడెద్లపైనే ఆధారపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎడ్ల నాగలితో వెళ్తే రూ.3,500 ఇస్తున్నారు. కొందరు రైతులు విత్తనం వేశాక అమ్ముకుంటున్నారు. కాడెద్ల జతకు రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ఉంది.

### పసుపు వేసేందుకు..



వ్యవసాయంలో ట్రాక్టర్లతోనే అన్ని పనులు చేస్తున్నారు. ఆధునిక యంత్రాల రాకతో నాకున్న ఎడ్లను అమ్మిన. ఇప్పుడు పసుపు విత్తనం వేసేందుకు రూ.3,500 ఇస్తున్నాం. వారంముందే ఎడ్ల నాగలి మనిషికి అడ్వాన్స్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా గ్రామాల్లో రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

– గడ్డం గంగారెడ్డి, చల్‌గల్

### ఎడ్లు దొరికే పరిస్థితి లేదు



ఎడ్ల నాగలితో విత్తనం వేస్తేనే బాగా మొలకెత్తుతుంది. ఇందుకోసం ఎడ్లు కొందామన్నా.. ఎక్కడా దొరికే పరిస్థితి లేదు. ఒక్కో జతకు రూ.80వేల పలుకుతోంది. విత్తనం వేసే వారంముందే ఎడ్ల నాగలిని కిరాయి తీసుకుంటున్నాం. మిగతా పనులు చేయడానికి ట్రాక్టర్ ఉపయోగిస్తాను.

– రాంకిషన్, వెల్దుర్తి